క్లుప్తంగా

వెంకన్న భక్తులకు అన్నసమారాధన



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

సర్కార్ విద్యా విధానంపై నిరసన



గుడ్లవల్లేరు: ప్రభుత్వ నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ గుడ్లవల్లేరు మండలం కౌతవరం మెయిన్ స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. మండల వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు పడమటి సుజాత నాయకత్వంలో శనివారం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలోని కొన్ని తరగతులను వేరే స్కూల్‌కు తరలించారన్నారు. ఆ పాఠశాల విద్యార్థులకు దూరం కావటంతో రానున్న రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కోనున్నారని తెలిపారు. ఆ తరగతులను తరలించవద్దని కోరారు.

నేడు ఎస్‌జీఈసీ స్నాతకోత్సవం

గుడ్లవల్లేరు: శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ 24వ స్నాతకోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ 48వ చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా డాక్టర్ నూతులపాటి వెంకటరమణ రానున్నారని పేర్కొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. వల్లభనేని కమలమ్మ పేరిట మనవడు కొల్లి రాజేష్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు ఈ పరీక్షలు చేశారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ ప్రతినిధులు చిట్టిబాబు, పెరుమాళ్ల పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించండి



గుడివాడ టౌన్: చిన్న తరహా పరిశ్రమలకు, గృహాలకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలని శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకుడు ఆర్.రఘు డిమాండ్ చేశారు. శనివారం ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్‌లోని విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ ఆటోనగర్‌లో స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత 37 మంది వినియోగదారులకు గత బిల్లులతో పోలిస్తే మూడు రెట్లు అధికంగా విద్యుత్ వినియోగించినట్లు రీడింగ్‌లు చూపించాయన్నారు. గతంలో రూ. 3 వేలు బిల్లు చెల్లించేవారికి ఇప్పుడు రూ.16 వేలు బిల్లు వచ్చిందని రూ. 4 వేలు చెల్లించే వారికి రూ.22 వేలు బిల్లు చూపించడం విచిత్రంగా ఉందన్నారు. యూనియన్ అధ్యక్షుడు హమీద్, ప్రధాన కార్యదర్శి ఖుర్దూస్, గౌరవాధ్యక్షుడు టి. లక్ష్మణరావు పాల్గొన్నారు.

మొవ్వ వైద్యాధికారి బదిలీ

మొవ్వ: మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.వేద రాజ్ చిత్తూరు జిల్లా కుప్పం వైద్యశాలకు బదిలీ అయ్యారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన బదిలీ అయ్యారని అధికారులు శనివారం తెలిపారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

చెరువు మట్టి దోపిడీ!

పెనుమత్సలో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



పెనుమత్స చెరువులో సాగుతున్న మట్టి తవ్వకాలు

పమిడిముక్కల: మండలంలోని పెనుమత్స చెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. మూడు పొక్లెయిన్లను ఉపయోగించి 20 ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పుకు ట్రాక్టర్‌కు రూ.600 చొప్పున వసూలు చేస్తూ కూటమి సర్పంచ్ అడ్డగోలుగా మట్టి దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పేదల ఇళ్ల స్థలాల మెరక కోసం ఇవ్వాల్సిన మట్టిని గ్రామంలో పెద్దల ఇంటి ఆవరణలో పెద్ద మొత్తంలో డంప్ చేస్తున్నారు. చెరువులో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ లోతులో తవ్వకాలు చేస్తున్నా, గ్రామంలో పలుచోట్ల పెద్ద మొత్తంలో నిల్వ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు.

నిబంధనలు ఇలా..



పెనుమత్స గ్రామంలో నిల్వ చేసిన మట్టి

పెనుమత్స గ్రామంలోని య.11.53 సెంట్ల ఊర చెరువులోని మట్టిని తీసి కట్టలు బలపరచుట, ప్రభుత్వ స్థలాలు మెరక చేయుట, మిగిలిన మట్టిని పేదల ఇళ్ల స్థలాలను మెరక చేసుకునేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారు. పంచాయతీ తీర్మానం మేరకు చెరువులో 16,580 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసి, అందులో 6,394 క్యూబిక్ మీటర్లు మట్టితో చెరువు కట్టల పటిష్టత, 2,570 క్యూబిక్ మీటర్ల ప్రభుత్వ స్థలాల మెరకకు ఉపయోగించుకోవాలి. మిగిలిన 7,616 క్యూబిక్ మీటర్ల మట్టి క్యూబిక్ మీటర్ 1కి రూ.47 చొప్పున బేసిక్ ప్రైస్‌గా నిర్ణయిస్తూ బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు రూ.7.90 లక్షలతో అంచనాలను మచిలీపట్నం ఈఈ సాంకేతిక మంజూరును జారీ చేశారు. ఈ అనుమతిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా మట్టిని తీసి అక్రమాలకు పాల్పడుతున్నారు.

నిబంధనలకు పాతర

నిబంధనల ప్రకారం ముందుగా చెరువు కట్టలను బలపరచాల్సి ఉంది. అయితే గత కొన్ని రోజులుగా మట్టిని బయటకు తరలిస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఆ మట్టిని డంప్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ లోతులో మట్టిని తీస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన క్యూబిక్ మీటర్ల మట్టిని తీసి తరలించేశారని గత నెల 19వ తేదీన గ్రామస్తులు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. చెరువులో తీసిన మట్టి పరిమాణాన్ని నిర్ధారించేందుకు కమిటీ వేస్తున్నామని చెప్పి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో చెరువులో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.

పర్యవేక్షణ లేదు

చెరువు తవ్వకాలు జరిగేటప్పుడు పీఆర్ ఏఈ, ఈఓ ఆర్డీ, కార్యదర్శి తవ్వకాలను పర్యవేక్షించాల్సి ఉంది. ఎక్కువ లోతు తవ్వకుండా, పెద్ద మొత్తంలో తరలించకుండా చూడాల్సిన బాధ్యత వీరిదే. మట్టి తవ్వకాలకు సంబంధించిన రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత కార్యదర్శికి ఉండగా, చెరువు వద్ద ప్రైవేటు వ్యక్తులు మట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. అయితే అధికారులు చెరువు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. కార్యదర్శి, వీఆర్వో, ఎంపీడీఓ, తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, కూటమి పాలనలో న్యాయం జరగడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువు పక్కనే పాఠశాల ఉంది. మట్టితో వెళుతున్న ట్రాక్టర్ల నుంచి వస్తున్న దుమ్ము, ధూళితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో దుమ్ము వచ్చి విద్యార్థుల భోజనంలో పడుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యకం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవావాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెరువు తవ్వకాలపై ఎంపీడీఓ వీర్ల విజయరామరాజు, ఈఓఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావును వివరణ కోరగా విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెరువు పక్కనే ఉన్న పాఠశాల

'యువత పోరు'ను విజయవంతం చేయండి



గుడివాడలో పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: కూటమి ప్రభుత్వం విద్యార్థులను, యువతను మోసం చేసిన నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని నివాసం వద్ద యువత పోరు పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో యువతరం పూర్తిగా నష్టపోయిందన్నారు. వలంటీరు వ్యవస్థ రద్దు చేయడం, నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థ రద్దు, మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి నిరుద్యోగ సమస్యను పెంచారన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేలు భృతి, విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ వంటివి ఎగవేసి యువతను దారుణంగా ముంచారన్నారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇచ్చి దాని ప్రకారం ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసాం చేశారన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి ఈ విషయాన్ని గుర్తు చేసేందుకు ఈనెల 23వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత, ఉద్యోగాలు కోల్పోయిన వారు, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, నాయకులు, మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నందివాడ మండల అధ్యక్షుడు పెయ్యల ఆదాం, టీవీ రమణకుమార్, యువజన విభాగం నాయకులు గంటా సురేష్,, అడపా హర్ష, అద్దేపల్లి పురుషోత్తం, లోయ రాజేష్, చుండూరి శేఖర్, మణికంఠ, టి. ప్రశాంత్, మూడెడ్ల ఉమ, పి. కృష్ణారావు, హారిక, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరులో..

కైకలూరు: కూటమి ప్రభుత్వం మాట తప్పిన తీరును నిరసిస్తూ ఈ నెల 23న ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించే కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పిలుపునిచ్చారు. కైకలూరు పార్టీ కార్యాలయం వద్ద యువత పోరు పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. డీఎన్నార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యతను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. అయితే ప్రస్తుతం విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. యువత పోరుకు యువత కదిలిరావాలని కోరారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ సెక్రటరీ మహమ్మద్ గాలిబ్‌బాబు, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ మహాదేవ విజయబాబు, కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు పంజా రాంబాబు, కన్నా రమేష్, నాగేశ్వరరావు, శ్యామల రావు, కరేటి రాంబాబు, రామాంజనేయులు, ఆంజనేయులు, నిమ్మల శ్రీను, అనిల్, నీలం నాగరాజు, ఉండ్రామట్ల యేసు కుమార్, సుబ్బారావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అవస్థలు పట్టించుకోరా?

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు యూపీ స్కూళ్లను ఎత్తివేయడంతో విద్యార్థులు పడుతున్న ఇక్కట్లను పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదినేపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల స్థానిక ప్రజాప్రతినిధులకు కనీసం సమాచారం ఇవ్వకుండా అనేక ఉన్నత పాఠశాలలను తొలగించడం దారుణమన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొరగుంటపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎత్తివేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ పాఠశాలకు చెందిన 6, 7, 8 తరగతుల విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లూరు లేదా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బొమ్మినంపాడు హైస్కూళ్లకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కోడూరులోని యూపీ స్కూల్‌ను ఎత్తివేయడంతో ఈ గ్రామానికి చెందిన విద్యార్థులు ఏడు కిలోమీటర్లు పైబడి ఉన్న ముదినేపల్లి లేదా పెదపాలపర్రు హైస్కూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు చెప్పారు. విద్యార్థుల అవస్థలను పరిశీలించి యూపీ స్కూళ్లను పునరుద్ధరించాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పామర్రు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల యోగాసనాలు



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని



గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో యోగా దినోత్సవం

పామర్రు: యోగా చేయటం వలన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మార్కెట్‌యార్డు, జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం, మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సచివాలయాల్లో యోగా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ పీడీ జీ మురళీ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తోట్లవల్లూరు, పమిడిముక్కల, మొవ్వ, పెదపారుపూడు మండలాల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో యోగా దినోత్సవం శనివారం నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం, స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు స్టేడియం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో యోగా డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో పలుచోట్ల యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

కైకలూరులో..

కైకలూరు: ఆరోగ్యకర జీవనానికి యోగా అత్యవసరమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శనివారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఏలూరు నుంచి వచ్చిన యోగా మాస్టార్ సత్యారావు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కొల్లి బాబి, కేవీఎస్ ఎం.నాయుడు, పూల రాజీ పాల్గొన్నారు. అదేవిధంగా ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో పలుచోట్ల యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

రెండు గడ్డి వాములు దగ్ధం

మొవ్వపాలెం(మొవ్వ): మొవ్వ మండలంలోని మొవ్వ పాలెంలో శనివారం ఐదు ఎకరాల వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. గడ్డి వాముపై నుంచి వెళ్లిన విద్యుత్ వైర్ల వలన జరిగిన ఈ ప్రమాదంలో తూమేటి రంగబాబుకు చెందిన రెండు ఎకరాల గడ్డి వాము, మద్దాల మురళీకృష్ణకు చెందిన మూడు ఎకరాల గడ్డి వాము దగ్ధమయ్యాయి. రూ.50వేల నష్టం వాటినట్లు మొవ్వ ఫైర్ అధికారి కొణతం వెంకటేశ్వరరావు తెలిపారు. ఫైర్ సిబ్బంది వేణుగోపాల్, కేవీ నాగరాజు, బీఎస్ఆర్‌కే ప్రసాద్, జీ నాగరాజు సహకారంతో మంటలను అదుపు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం

గుడివాడ టౌన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పలు ఏర్పాట్లు చేస్తోందని ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహన సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పొగ తాగవద్దు-క్యాన్సర్ వ్యాధికి గురి కావద్దు అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులలో ఈ వాహనం ద్వారా సేవలందిస్తారన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. వారంలో రెండు రోజులు గుడివాడ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటుందని ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంకలో శనివారం గంగానమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. అమ్మవారు, పోతురాజుల ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. నందివెలుగు కిరణాచార్యులు బ్రహ్మత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, సర్పంచ్ రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ ఫీడర్ ప్రారంభం

కైకలూరు: గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య, ఓవర్‌లోడ్‌ను తగ్గించేందుకు రామవరం విద్యుత్ ఫీడర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. వరహాపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 11కేవీ రామవరం ఫీడర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ.శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, మచిలీపట్నం విద్యుత్ సర్కిల్ ఎస్ఈ ఎం.సత్యానందం పాల్గొన్నారు.

పులపర్రులో అగ్ని ప్రమాదం

మండవల్లి: మండలంలోని పులపర్రులో గ్రామంలో కిక్కిస అగ్నికి ఆహుతవ్వడంతో శనివారం ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. మంటలు పరిసరాలకు వ్యాపించకుండా అదుపు చేసినట్లు ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్ పేర్కొన్నారు.

ముప్పాళ్ల సుబ్బారావు విగ్రహావిష్కరణ



గుడివాడ టౌన్: విద్యా సంస్థలు ఏర్పాటు చేసి అనేకమందికి విద్యనందించిన విద్యాదాత ముప్పాళ్ల సుబ్బారావు అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక విద్యావికాస్ పాఠశాల ఆవరణలో శనివారం సంస్థ ఫౌండర్, డైరెక్టర్ ముప్పాళ్ల సుబ్బారావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, గుడ్లవల్లేరు కళాశాల విశ్రాంత అధ్యాపకులు వై. పూర్ణచంద్ర ప్రసాద్, ఎం.కృష్ణారావు, అకాడమీ డైరెక్టర్ రేష్మా చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పామర్రు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఎస్ఆర్‌ఐ డోనర్స్ ఫర్ నోట్ బుక్స్ స్కీం అనే కార్యక్రమంలో భాగంగా వాసవీ ఇంటర్నేషనల్ దుబాయికి చెందిన పీసీ హరి ప్రసాద్ సౌజన్యంతో 500 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను శనివారం అందజేశారు. అనంతరం స్థానిక వాసవీ కల్యాణ మండలంలో డాస్ టు దస్కులో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం, కార్యదర్శి కేవీ జనార్దనరావు, కోశాధికారి వెంకట ప్రణీత్, సభ్యులు సాయిబాబు, భరతుడు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైనార్టీలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం



గాలిబ్‌బాబును సన్మానిస్తున్న డీఎన్నార్

కైకలూరు: కూటమి ప్రభుత్వంలో మైనార్టీలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేయాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రటరీగా ఎంపికైన కైకలూరు వార్డు సభ్యుడు, న్యాయవాది మహమ్మద్ గాలిబ్‌బాబును పార్టీ కార్యాలయంలో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా గాలిబ్‌బాబు మాట్లాడుతూ తనకు రాష్ట్ర పదవి కేటాయించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏలూరు జిల్లా అధ్యక్షులు డీఎన్నార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎన్నార్ తనయుడు దూలం వినయ్‌కుమార్, కైకలూరు మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సింగంశెట్టి రాము, పి.అనిల్‌కుమార్, నాయకులు వైబీఎం సాంబశివరావు, పంజా నాగు, తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు మంగళ సూత్రం అందజేత



ఐనంపూడి(పామర్రు): ఐనంపూడిలో ఎన్నికల జరిగిన సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు ఆ గ్రామంలోని ఏ ఇంట్లో వివాహం జరిగినా .. వారికి బంగారు మంగళసూత్రం అందజేయటం ఆనవాయితీగా జరుగుతోంది. ఐనంపూడి సర్పంచ్ భట్టు పరంజ్యోతి రాఘవ ఎన్నికల సమయంలో సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రతి ఇంట్లో జరిగే వివాహ వేడుకలకు బంగారు మంగళ సూత్రం అందిస్తానని వాగ్దానం చేశారు. ఈ మేరకు గ్రామంలో శాంతిబాబు వివాహం శనివారం సందర్భంగా ఆ కుటుంబానికి బంగారు మంగళ సూత్రం అందజేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు బీవీ రాఘవులు పాల్గొన్నారు.

వ్యవసాయ త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో మార్పులు

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ విద్యుత్ సబ్ స్టేషన్‌లోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల ఉంటుందని విద్యుత్ ఏఈ వరకుమార్ శనివారం తెలిపారు. యలమర్రు 400 కేవీ టవర్ లైన్ నిర్మాణంతో యలమర్రు, వెంట్రప్రగడ, దోసపాడు, తదితర గ్రామాల్లో వ్యవసాయ త్రీఫేస్ సరఫరా ఆదివారం ఉదయం 3 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇవ్వనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.